
బిత్తర లేపుతున్న కత్తెర





ఆత్మకూరు, జూలై 17: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తారు. అయితే మొక్కజొన్నతో పాటు మరి కొన్ని పంటల పాలిట మహమ్మారిగా తయారైన కత్తెరపురుగు (స్పోడోప్టెరా - ఫ్రూజీపెర్డా) ఆశించకుండా తొలి నుంచే ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. లేకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాస్తవానికి ఆఫ్రికా దేశాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగించిన లెపిడప్టరన్ జాతికి చెందిన ఈ పురుగు దేశంలో 2018లో తొలిసారిగా కరాటక రాష్ట్రంలో మొక్కజొన్న పైరుపై ప్రభావం చూపింది. ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల్లో మొక్కజొన్న పంటపై తీవ్ర నష్టాన్ని కలిగించింది. ప్రత్యేకించి ఆత్మకూరు, నందికొట్కూరు వ్యవసాయ డివిజన్ల పరిధిలో మొక్కజొన్న పైరును కత్తెర పురుగు ఆశించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రతిఏటా కత్తెర పురుగును నియంత్రించేందుకై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి సారించి రైతులను అప్రమత్తం చేస్తోంది. అయితే మొక్కజొన్న సాగుకు సంబంధించి విత్తన శుద్ధి మొదలుకుని పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు పాటించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



మొక్కజొన్న దిగుబడులపై కత్తెర పురుగు ప్రభావం
దిక్కుతోచని స్థితిలో రైతులు
అప్రమత్తతోనే నియంత్రణ సాధ్యం



పంటపై కత్తెర పురుగు ప్రభావం ఇలా :

కత్తెర పురుగు లద్దె పురుగును పోలినట్లు ఉంటుంది. గుడ్డు దశ 3 నుంచి 7 రోజుల ఉండగా, లార్వా దశ 20 రోజుల వరకు ఉంటుంది.. రెక్కల పురుగు ఒకేసారి 900 నుంచి 1500 వరకు గుడ్లు పెడుతుంది. ఈ దశలో ఎప్పుడూ ఆకలితోనే ఉంటూ విపరీతమైన తిండి తింటుంది. ఆ సమయంలో పంటపై కత్తెర పురుగు ప్రభావాన్ని చూపుతుంది. ప్రధానంగా కంకి, ఆకులను పురుగు పూర్తిగా తినేస్తోంది. కంకి సుడిలోకి ప్రవేశించి కంకి ఎదుగుదలను నిలిపివేస్తోంది. గుడ్డు దశలోనే కత్తెర పురుగును నియంత్రిస్తే పంటపై కత్తెర పురుగు ప్రభావాన్ని తగ్గించవచ్చు. కాగా మొక్కజొన్న సాగులేని చోట వరి, పత్తి, అపరాలు, జొన్న, సోయా, చెరకు, పొగాకు, కూరగాయల పంటలను కూడా కత్తెరపురుగు ఆశిస్తోంది.

పైరు వివిధ దశల్లో ఉన్నప్పుడు

పంట 15 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు 10 ఫిరామోన్ ట్రాప్స్(లింగాకర్షక బుట్టలు) ఏర్పాటు చేస్తే పురుగు ఉన్నట్లయితే ఫిరామోన్‌ట్రాప్స్ వాటిని ఆకర్షించి నియంత్రించేందుకు దోహదపడుతోంది. అదేవిధంగా రక్షణ పంటగా ఆముదం, అంతర పంటగా మినుము, పెసర, పశువుల గడ్డి(నేపియర్ గ్రాస్) వంటి పంటలను సాగు చేయడం వల్ల కూడా పురుగు తీవ్రతను కట్టడి చేయవచ్చు. కాగా 25 నుంచి 30రోజుల వ్యవధిలో ఎసిఫేట్ లీటర్ నీటిలో ఒక గ్రామ్ చొప్పున కలిపి రెండు విడతల్లో పిచికారి చేయాలి. అలాగే పంట 35 నుంచి 60రోజుల దశలో ఎకరాకు 60లీటర్ల నీటిలో 200గ్రాముల హిమామెప్టిన్‌బెంజోఏడ్‌ను కలిపి ఆ ద్రావణాన్ని మొక్క సుడుల్లో నింపడం వల్ల పురుగు నశించేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. లేక క్లోరాంతనిలిప్రోల్ (ఫర్టెరా, బెబివియా గుళికలు) ఎకరాకు 3 లేక4 కేజీల చొప్పున మొక్క సుడిలో నింపాలి. అదే క్రమంలో 80గ్రాముల హిమామెప్టిన్ బెంజోఏడ్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారి చేయాల్సిన అవసరం ఉంది. ఈవిధంగా పంటచేతికొచ్చే వరకు కత్తెర పురుగు ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



జిల్లాలో 45,210 హెక్టార్లలో మొక్క సాగు సాధారణ సాగు విస్తీర్ణం

నంద్యాల జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.35లక్షల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా అందులో 45,210 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాధారణ సాగు విస్తీర్ణం నమోదయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటిలో ఆయా వ్యవసాయ డివిజన్ల వారిగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం అంచనాలు ఇలా ఉన్నాయి.

వ్యవసాయ డివిజన్ సాధారణ సాగువిస్తీర్ణం (హెక్టార్లలో)

నందికొట్కూరు	-	15854
ఆత్మకూరు	-	16833
నంద్యాల	-	4783
ఆళ్లగడ్డ	-	5732
కోవెలకుంట్ల	-	1175
డోన్	-	833
మొత్తం		45210 హెక్టార్లు

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు కత్తెర పురుగు ఉధృతిపై తొలి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం విత్తన శుద్ధి మొదలుకుని పంట చేతికొచ్చే వరకు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కత్తెర పురుగు నివారణ చర్యలపై ఇప్పటికే గ్రామాలను సందర్శించి రైతులకు అన్నివిధాలుగా అవగాహన కల్పిస్తున్నాం. నివారణ పద్ధతులు పాటిస్తే కత్తెర పురుగును నియంత్రించి అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులు అనవసరంగా పంటకు వివిధ రకాల రసాయనాలను పిచికారి చేసి ఆర్థికంగా నష్టపోవద్దని సూచిస్తున్నాం. ఆయా పంట దశలకు సంబంధించి కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణపై రైతులు అవగాహనతో ముందుకెళ్తే పెట్టుబడులను తగ్గించడంతోపాటు అధిక పంట దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

- ఆంజనేయులు, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఆత్మకూరు

కత్తెర పురుగు నియంత్రణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు



కంకి సుడుల్లో హిమామెప్టిన్‌బెంజోఏడ్‌ను కలిపిన ద్రావణాన్ని నింపుతున్న రైతులు

కత్తెర పురుగును నియంత్రించేందుకు తొలిదశ నుంచే తగు జాగ్రత్తలు పాటించాలి. ప్రత్యేకించి విత్తన శుద్ధితో కత్తెర పురుగును కట్టడి చేయవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇందుకోసం సైన్‌ట్రానిలిప్రోల్ 19.8శాతం, థయోమెథాగ్జామ్ 19.8శాతం మందుల్ని కిలో విత్తనానికి 4మి.లీ చొప్పున విత్తన శుద్ధి చేయాలి. లేనిపక్షంలో ఇమిడాక్లోప్రిడ్‌ను కేజీ విత్తనానికి 0.6గ్రాములతో విత్తన శుద్ధి చేయవచ్చు. ఆలాచేస్తే మొలక తర్వాత 2నుంచి3 వారాల పాటు పురుగు ఉధృతిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. అయితే కత్తెర పురుగు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విత్తన కంపెనీలే మొక్కజొన్న విత్తనాన్ని విత్తన శుద్ధి చేసి మరీ విక్రయిస్తున్నారు. కాగా విత్తనం వేసిన ఓ వారంలోపు ఒక లీటర్ నీటిలో 5 మి.లీ వేపనూనెతో పంటపై పిచికారి చేయడం వల్ల కత్తెర పురుగును లార్వా దశ నుంచే నిర్మూలించవచ్చు. పంట పెరిగే కొద్ది సస్యరక్షణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఒకవేళ పంట ఎదిగే దశలో కత్తెర పురుగు ఆశించినట్లయితే లీటర్ నీటిలో 0.5 గ్రాముల హిమామెప్టిన్‌బెంజోఏడ్ కలిపి పిచికారి చేయడం వల్ల పురుగు ఉధృతిని నివారించవచ్చు.



కత్తెర పురుగు నివారణపై ఆత్మకూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు


ప్రజలు ఎవరైనా నేరుగా నాతో మాట్లాడొచ్చు: ఎస్పీ



నంద్యాల క్రైం, జూలై 17 : జిల్లాలోని ప్రజలు ఎవరైనా నేరుగా తనతో మాట్లాడవచ్చని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. బుధవారం విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ కంప్లైంట్ సెల్, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన ఫిర్యాదులపై సమాచారం తెలుసుకోవడానికి, శాంతిభద్రతలకు సంబంధించి తనతో సంప్రదించాలనుకున్నా.. మాట్లాడాలనుకున్నా ఫిర్యాదుదారులు తన సెల్ నెంబర్ 9154987020కు ఫోన్ చేయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి, జాబ్ ఇప్పిస్తామని మోసం చేసినా, బిట్‌కాయిన్స్‌కు సంబంధించిన వ్యవహారాలైనా, లోన్ యాప్‌లో మోసపోయినా మరెలాంటి ఇతర సైబర్ మోసాలకు గురైనవారైనా మొదట 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అలాగే సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్‌సైట్లో గాని, జిల్లా సైబర్ క్రైం విభాగానికి సంబంధించి 9154987034కు గాని ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు.

మళ్లీ చిరుతపులి కలకలం

- మహానందిలో మరోసారి సంచారం
- పంది పిల్లను నోట కర్చుకొని నల్లమలలోకి వెళ్లిన వైనం
- భయాందోళనలో భక్తులు, స్థానికులు



మహానంది, జూలై 17: మహానందిలో మరోసారి చిరుతపులి సంచారం కలకలం రేపింది. దీంతో భక్తులు, స్థానికుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. కొద్ది రోజులుగా చిరుతపులి సంచారం లేకపోవడంతో స్థానిక ప్రజలు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బుధవారం తిరిగి చిరుతపులి మహానందిలో ప్రత్యక్షం కావడంతో జనం ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. క్షేత్రానికి సమీపంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఉన్న మైదానం వద్ద చిరుతపులి పంది పిల్లపై దాడి చేసింది. స్థానికులు గమనించి కేకలు వేయడంతో పందిపిల్లను నోట కర్చుకొని నల్లమల అడవిలోకి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ప్రజలు అటవీశాఖ అధికారులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి చిరుతపులిని బంధించాలని స్థానిక ప్రజలతోపాటు భక్తులు కోరుతున్నారు.

ఊరి రుణం తీర్చుకుంటా

ఒడిసా సీఈవో డాక్టర్ తిరుమలనాయక్



ఒడిసా సీఈవో తిరుమలనాయక్, ఆయన సోదరుడికి పూల బొకేలు ఇస్తున్న దృశ్యం

అవుకు, జూలై 17 : జన్మనిచ్చిన ఊరు రుణం తీర్చుకుంటానని ఒడిసా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) డాక్టర్ తిరుమల నాయక్ అన్నారు. మొహర్రం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం కుటుంబ సమేతంగా ఆయన అవుకు వచ్చి తన స్నేహితుడు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణనాయక్ ఇంట్లో బస చేశారు. అవుకు గ్రామానికి చెందిన తిరుమలనాయక్ ఒడిసా క్యాడర్ నుంచి ఐఏఎస్‌గా ఎన్నికై ప్రస్తుతం సీఈవోగా అత్యున్నత పదవి చేపట్టడంతో ఉదయం గ్రామ ప్రజలు ఆయనను కలుసుకొని అభినందించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పీర్ల చావిళ్ల వద్దకు, అవుకు గ్రామదేవత మూలమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా తిరుమలనాయక్ మాట్లాడుతూ తాను అవుకు ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నానని అన్నారు. పాఠశాలకు అవసరమయ్యే వనరులను సమకూర్చుతానన్నారు. మండలంలోని తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి మినరల్ వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌నాయక్, గుడిపాటి రామక్రిష్ణ, నంది, మిద్దె ప్రసాద్, జయనాయక్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

విషాద గీతాలాపనతో మొహర్రం

రక్తసిక్తమైన బనగానపల్లె వీధులు ● దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశస్తుల ఫతేహాలు



పీర్ల వెంట పాల్గొన్న నవాబు వారసులు మీర్‌ఫజిల్ ఆలీఖాన కుటుంబ సభ్యులు



మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు



బనగానపల్లె, జూలై 17: బనగానపల్లె పట్టణంలో బుధవారం విషాదగీతాలతో మొహర్రం ముగిసింది. కర్బాలా మైదానంలో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మహమ్మద్ ప్రవక్త మనుమలైన ఇమాం హసన్, ఇమాంహుసేన్, వారి కుటుంబ సభ్యుల మృతికి సంతాప సూచకంగా నిర్వహించే మొహర్రం విషాద ప్రార్థనా గీతాలతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లోనే మతాతీతంగా జరిగే ఈ కార్యక్రమా లను తిలకించడానికి వేలాది మంది వివిధ జిల్లాల నుంచి తరలివచ్చారు. పట్టణంలోని దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశీయుల వారసులు మీర్ ఫజుల్ అలిఖాన్, వారి కుటుంబసభ్యులు, షియా ముస్లింలు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు చేశారు. దొరకోటలోని గంధం పీరు వద్ద మొదట నవాబు మీర్ ఫజుల్ అలిఖాన్ వంశీయులు ఫతేహాలు నిర్వహించాక మొహర్రం ఊరేగింపు ప్రారంభమైంది. పలువురు షియా మతస్థులు దొరకోట వద్ద తలపై కత్తితో కోసుకొని అమరులైన ఇమాంహుస్సేన్ వారి కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ, నల్లదుస్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. షియా ముస్లింలు బ్లేడులు, కత్తులతో ఎదలపై కొట్టుకుంటూ పీర్ల వెంట బాధాతప్త హృదయాలతో విషాద గీతాలు పాడుకుంటూ మాతంలో పాల్గొన్నారు. దీంతో బనగానపల్లె పట్టణంలోని వీధులు రక్తసిక్తమయ్యాయి. పట్టణంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలు మేడలు, మిద్దెలు ఎక్కి ఈ కార్యక్రమాన్ని తిలకించారు. దొరకోట నుంచి పట్టణంలోని పోస్టాఫీసు, ఆస్థానం రోడ్డు, సర్కిల్ స్టేషన్, పాత బస్టాండు మీదుగా జుర్రేరువాగు వరకు ఊరేగింపు సాగింది. పట్టణంలోని మొత్తం 40 పీర్ల చావిళ్ల నుంచి పీర్లు దొరకోట పీర్ల వెంట రాగా సాయంత్రం జుర్రేరువాగుకు చేరుకున్నాయి. అక్కడ పీర్లను శుద్ధి చేసి తిరిగి పీర్ల చావిళ్లకు చేర్చారు. మొహర్రం సందర్భంగా పట్టణంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసి వేశారు. సంతాప సూచకంగా రాత్రి సినిమా హాళ్లు బంద్ చేయించారు. రాత్రి వీధిలైట్లు నిలిపి వేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు, పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు దాతలు మంచినీటిని ఉచితంగా అందించారు. షర్బత్ పంపిణీ చేసిన బీసీ ఇందిరమ్మ, మనోరమః మొహర్రం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, కూతురు మనోరమ షర్బత్ పంపిణీ చేశారు. ఇందులో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు



షర్బత్ పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ, బీసీ మనోరమ

రహదారులకు నిధులు కేటాయించండి: మంత్రి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె , జూలై 17 : రాష్ట్ర, జాతీయ రహదారులకు నిధులు కేటాయించాలని కేంద్ర, రోడ్లు, రవాణా హైవే శాఖమంత్రి నితిన్ గడ్కరీని కలసి విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా తిరుపతి విమానాశ్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికినట్లు తెలిపారు. అనంతరం గడ్కరీతో చర్చించి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి హత్య

కర్నూలు, జూలై 17: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలమండలి కార్యాలయ సమీపంలో శ్రీరాములు ఆచారి (34)ని మంగళవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. తాడిపత్రికి చెందిన శ్రీరాములు ఆచారి గత కొద్ది రోజుల కింద కర్నూలు వచ్చాడు. పేపర్లు సేకరించుకొని వాటిని విక్రయిస్తూ జీవిస్తున్నాడు. రాత్రి కాగానే మద్యం తాగి ఫుట్‌పాత్ మీద పడుకుంటూ ఉంటాడు. ఈ నేపథ్యంలో ఈయనకు ఫాతిమా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె కూతురితో శ్రీరాములు ఆచారి అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా తేలడంతో రవి అనే వ్యక్తితో కలిసి ఫాతిమా శ్రీరాములు ఆచారి మీద రాళ్లతో దాడి చేసినట్లుగా పోలీసులు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుజామున వీరి మధ్య ఘర్షణ జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఫాతిమా, రవి కూడా చెత్త పేపర్లు సేకరించుకొని జీవిస్తున్నారు. శ్రీరాములు ఆచారికి పరిచయం ఉన్న మద్దమ్మ అనే మహిళ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఇంతియాజ్ బాషా ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

● రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్

బేతంచెర్ల, జూలై 16: మైనార్టీల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేసిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం విజయవాడలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆత్మీయ సమావేశం ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మహ్మద్ ఫరూక్ షబ్లీ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో పాల్గొన్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, టీడీపీ రాష్ట్ర సీనియర్ ప్రస్తుత మైనార్టీ న్యాయ శాఖ మంత్రి ఎస్ఎండీ ఫరూక్, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సృజనా చౌదరి, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ డీజీపీ వెంకటేశ్వరరావు మైనార్టీలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2024 టీడీపీ మేనిఫెస్టో మైనార్టీలకు పెద్ద పీట వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ మొహ్మద్ ఫరూక్ శుబ్లీకి అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

మహానంది, జూలై 17: మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు కల్లె శ్రీనివాసులు(62) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీన రైతు కల్లె శ్రీనివాసులు తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలేకోలేక బుధవారం మృతి చెందాడు. రైతు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని అరటితోపాటు వరి సాగు చేసాడు. అయితే పంటలపై పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పాటు సాగు కోసం రూ. 10 లక్షల మేర అప్పులు అయ్యాయి. అవి ఎలా తీర్చాలా అని మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

దొర్నిపాడు, జూలై 17: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని సుమలత (28) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. రామచంద్రాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సుమలత మంగళవారం రాత్రి నిద్రపోయి, బుధవరం తెల్లారాక 7 గంటలైనా నిద్ర లేవకపోవడంతో బంధువులు గమనించి తలుపులు తట్టారు. ఎంతకి పలకకపోవడంతో తలుపులు తీసి చూడగా అక్కడే కింద పడి కనిపించింది. వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమలత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి అక్క జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీఐ, ఎస్‌లపై సస్పెన్షన్ వేటు

బాలిక మిస్సింగ్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని చర్యలు


నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్


ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్

నందికొట్కూరు, జూలై 17: ముచ్చుమర్రిలో అదృశ్యమైన వాసంతి బాలిక కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇద్దరు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ కర్నూలు డీఐజీ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 7వ తేదీన వాసంతి కనిపించకుండా పోయిందని మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అయితే కేసు విచారణలో అలసత్వం వహించారని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్‌లపై డీఐజీ చర్యలు తీసుకున్నారు. దీంతో వారిద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. విధులపట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కూడా బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న జయశేఖర్ ద్విచక్రవాహనాలను మార్పిడి కేసులో సస్పెండ్ అయ్యారు. తిరిగి ఇప్పుడు ముచ్చుమర్రి ఎస్.ఐగా కూడా సస్పెండ్ అయ్యారు. విజయభాస్కర్‌పై కూడా నందికొట్కూరు పట్టణ సి.ఐ.గా ఉన్న సమయంలో మల్యాల గ్రామానికి చెందిన యువకులను చితకబాదిన కేసులో ప్రజా సంఘాల నుంచి నిరసన సెగను ఎదుర్కొన్నారు.

ఎల్లెల్సీ రైతులకు తీపి కబురు

● తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల


తుంగభద్ర గేట్లకు ప్రత్యేక పూజలు చేసి ఎల్లెల్సీకి నీటిని విడుదల చేసిన టీబీపీ బోర్డు ఇంజనీర్లు

కర్నూలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతం ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు తీపి కబురు. బుధవారం తుంగభద్ర జాలశయం నుంచి కాలువకు నీటిని విడుదల చేశారు. తొలి ఏకాదశి పర్వదిన పురస్కరించుకొని శుభదినం కావడంతో టీబీపీ బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణ, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు తుంగభద్రమ్మకు ప్రత్యేక పూజులు చేసి కాలువ తూములు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 39.71 టీఎంసీలు వరద చేరింది. 49,522 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వారం రోజుల్లో జిల్లా సరిహద్దుకు నీరు చేరే అవకాశం ఉంది. ఇప్పటికే బోరుబావుల కింద వరి నార్లు పెంచుకుంటున్న రైతులు వరి నాట్లకు సాగు సన్నాహలు చేస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేయడంతో ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు నియోకవర్గాల్లోని ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో ఆశాజనకంగా వరద చేరుతుండడంతో తక్షణమే జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేసి ఎల్లెల్సీ, కేసీ కాలువ కింద ఆయకట్టుకు ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇస్తారు..? తేల్చాలని రైతులు కోరుతున్నారు.


వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఎస్పీ బిందు మాధవ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త


శివుడికి అభిషేకం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు ● గోదా గోకుల క్షేత్రంలో జిల్లా న్యాయాధికారి, ఎస్పీ పూజలు

కర్నూలు(కల్చరల్), జూలై 17: తొలి ఏకాదశి పండుగను బుధవారం ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేకంగా ఏకాదశి పూజలు, ప్రత్యేక అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణాలు, హోమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి ఉపవాసాలు పాటించారు.

● **కర్నూలు నగరంలో:** నగర శివారులోని గోదా గోకులం (శ్రీగోదా రంగనాథస్వామి) క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆండాల్ సన్నిధిలో గోదమ్మకు నిత్య సేవా కైంకర్యం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి తిరుమంజన సేవ, అలంకారం, తిరుమాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ చేశారు. ఈ పూజాదికాల్లో జిల్లా ప్రధాన న్యాయాధికారి నేరేళ్ల శ్రీనివాసరావు, ఎస్పీ బిందుమాధవ్ పాల్గొన్నారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు వారికి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటాలు అందజేశారు.

● **సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో:** హరిహర క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలోని భవానీ సహిత రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం చేశారు. వెంకటరమణ కాలనీలో ఆలయంలో, బి.క్యాంపులోని విజ్ఞాన మందిరంలో, పాతనగరంలోని చిత్తారివీధిలోని దేవాలయంలో, కేసీ కెనాల్ సమీపంలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో, గుత్తి రోడ్డులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు.


గోకుల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

జీవో రద్దుకు చంద్రబాబు కృషి చేయాలి

● జీవో 4375 (ఈ) ఏపీకి ఉరితాడు
● రాజ్యాంగబద్ధ నీటి హక్కులను కాపాడాలి
● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూలై 17 : జీవో 4375 (ఈ) ఏపీకి ఉరితాడని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను బుధవారం నంద్యాలలోని సాగు నీటి సాధన సమితి కేంద్ర కార్యాలయంలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సాగు నీటి హక్కులకు విఘాతం కలిగించే విధంగా కేంద్రం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ రద్దుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలని కోరారు. కేంద్రం తెచ్చిన జీవోలోని నూతన విచారణ అంశాలతో, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణలో ఏపీ నీటి హక్కులకు విఘాతం కలిగించే దిశగా ప్రమాద ఘంటికలు స్పష్టంగా అగుపిస్తున్నాయని పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ జీవో 4375(ఈ) తేదీ 6-10-2023 రాష్ట్ర నీటి హక్కులపై తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను కలగజేస్తుందని అన్నారు. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా జలాలను ప్రాజెక్టుల వారీగా పంపకం చేసిన విషయం తెలిసిందేనని, బచావత్ కేటాయింపులను సుప్రీంకోర్టులో కూడా మార్చడానికి వీలులేకుండా పార్లమెంట్ చట్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టుల వారీగా నీటి పంపకాన్ని కొనసాగించాలని, ఏపీ విభజన చట్టంలో కూడా పొందుపరిచారని పేర్కొన్నారు. వీటన్నింటినీ కాదని ఏపీ సాగు నీటి హక్కులను కాలరాస్తూ కృష్ణా జలాల పునఃపంపిణీ ద్వారా తెలంగాణకు లబ్ధి చేకూరేలాగా కేంద్రం జీవోను తీసుకు రావడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నామని, తక్షణమే జీవోను రద్దు చేయించాలని కోరారు. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందుంచిన 'స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్'కు ఏపీ ప్రభుత్వం సమాధానం ఇవ్వడానికి చివరి అవకాశంగా నాలుగు వారాల సమయాన్ని ఈ నెల 15న జరిగిన విచారణ సందర్భంగా ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి కేంద్రం తెచ్చిన రాజ్యాంగ విరుద్ధ గెజిట్ నోటిఫికేషన్ రద్దు దిశగా కృషి చేయాలని, రాష్ట్ర సాగునీటి హక్కులను కాపాడాలని సీఎంకు పంపిన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి జీవో రద్దు చేసే దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకు రావాలని బొజ్జా దశరథరామిరెడ్డి చంద్రబాబుకు రాసిన లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు.

అహోబిలంలో తొలి ఏకాదశి పూజలు


అహోబిలంలో ఉత్సవమూర్తులకు ఏకాదశి పూజలు చేస్తున్న వేదపండితులు

నంద్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు వేదపండితులు తొలి ఏకాదశి పూజలు చేశారు. వేకువ జామునే ఉత్సవ మూర్తులను పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పండుగను గ్రామాల్లోని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కర్నూలు, జూలై 17: నగరంలో ధర్మపేట సమీపంలో సునీల్ అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యయత్నం చేశాడు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా పెండ్లమావి అనే గ్రామానికి చెందిన ఈయన బుధవారం మధ్యాహ్నం ఆత్మహత్నాయత్నం చేశాడు. ఈ ప్రమాదంలో అతడి రెండు కాళ్లు విరిగాయి. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడ్ని ఆసుపత్రికి తరలించారు. సునీల్ దగ్గర లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోవెలకుంట్ల, జూలై 17: మండల పరిధిలోని గుంజలపాడు గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్(23) మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరికుమార్ కుమారుడు పవన్ కుమార్ మోటరు సైకిళ్‌పై గుంజలపాడుకు వెళ్లి తన పని ముగించుకొని తిరిగి కోవెలకుంట్లకు వస్తుండగా బైకు అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి హరికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సుంకేశ్వరిలో అదే పరిస్థితి

● ఇద్దరి చిన్నారులకు తీవ్ర అస్వస్థత
● కర్నూలు ఆసుపత్రికి తరలింపు


వైద్యులకు సూచనలు ఇస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ


ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుంకేశ్వరి గ్రామ అతిసార బాధితులు

మంత్రాలయం, జూలై 17: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో బుధవారం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన దాదాపు 13 మందిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మూడు రోజుల క్రితం ఈరన్న, అంజలి దంపతుల కూతురు జ్యోతి మృతి చెందగా.. మృతురాలి అన్న అభిరామ్ (4), ఎరుకులి రవి, అంజనమ్మల కుమారుడు ధనుష్ (8)లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని కర్నూలు ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, మండల వైద్యాధికారి గోవిందమ్మ, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, డీటీ రాఘవేంద్ర, సర్పంచ్ ముకురన్న, వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవిలు దగ్గరుండి వైద్యసేవలు అందిస్తున్నారు. 108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు. సుంకేశ్వరిలో విజృంభించిన అతిసారాను అదుపులోకి తెచ్చేందుకు నిరంతర వైద్యశిబిరం కొనసాగుతుందని, ఇందులో ఎవరూ ఏ శాఖ అధికారి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ హెచ్చరించారు. బుధవారం బాధితులకు అందుతున్న వైద్యసేవలను, పరిశుభ్రత, తాగునీరు సరఫరా, గ్రామ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

డేంజర్ డాగ్స్

● కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తిపోతున్న జనాలు




కుక్క కాటుకు గురైన ఆరేళ్ల బాలుడు రాము (ఫైల్)

ఆదోని, జూలై 17: ఆదోని పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. రాత్రుల్లో ఇండ్లకు చేరుకోవాలంటే మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులకూ కష్టాలు తప్పడం లేదు. నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులను వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే వారి వెంట పడుతున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తాజాగా ఆదోనిలో వేరు వేరుగా జరిగిన కుక్కల దాడి ఒక బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని చిన్న మార్కెట్, శంకర్ నగర్, మున్సిపల్ ప్రధాన రోడ్డు, కౌడల్ పేట, రాజీవ్ గాంధీ నగర్, బోయగేరి, శుక్రవారపేట, జిమ్ సర్కిల్ తదితర కాలనీలో రాత్రి, పగలు అనే తాడా లేకుండా పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయి. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. ఉదయం వాకింగ్ పోయేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటపడి తరుముతున్నాయి. రెండు రోజుల క్రితం రాజీవ్ గాంధీ నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు రాముపై కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తలపై కరవడంతో పరిస్థితి విషమించింది. దీంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నా పట్టించుకునే పాలకులు, అధికారులే లేరని ప్రజలు వాపోతున్నారు. ఆరు నెలల్లో 1300 మందికి పైగా కుక్క కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి.

● **రాత్రి వేళల్లో చుక్కలే..**

ఉదయం వేళల్లో కంటే రాత్రి వేళల్లో కుక్కలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ జనాన్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాళ్లు తీసుకొని కొట్టినా వెంటపడి తరుముతున్నాయి. అతి కష్టం మీద వాటి బారి నుంచి తప్పించుకుని ఇళ్లకు చేరుకునే సరికి చుక్కలు కనిపిస్తున్నాయని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలంలో మాస్టర్ ప్లాన్ పరిశీలన

శ్రీశైలం, జులై 17: శ్రీశైలం క్షేత్ర మాస్టర్‌ప్లాన్ పరిశీలనలో భాగంగా బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్టర్ ప్లాన్ నిపుణులు కేఎస్ఎస్ వీవీ ప్రసాద్, రాజేంద్ర, ఐఐటీ ప్రొఫెసర్ డా.శశిధర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, మురళీధరరెడ్డి పాల్గొన్నారు. రాబోవు 50 సంవత్సరాలలో భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, స్వామి, అమ్మవార్ల పాకశాల, లడ్డూ ప్రసాదాల తయారీ కేంద్రం మొదలైన ప్రదేశాలలో అగ్నిమాపక యంత్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టనున్నారు. రహదారులు, పార్కింగ్, తాగునీటి ప్లాంట్లు, పుష్కరిణి, ఉద్యానవనాలు, వసతి భవనాలు, కళావేదిక నిర్మాణం, శివసేవకుల వసతి భవనం మొదలైన వాటిపై కూలంకూషంగా చిర్చించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు ● ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



జూటూరు ఆశ్రమం నుంచి పాదయాత్ర చేస్తున్న పీఠాధిపతి రామనందస్వామి



గడివేముల: బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 17: మహానంది క్షేత్రంలో తొలి ఏకదశి పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో వేదపండితులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం గణపతిపూజ, తిరుమంజన సేవతో పాటు రుద్రాభిషేకం, ఖడ్గమాలార్చన పూజలను వేదమంత్రాలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చల్లగాలి లక్ష్మయ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాలలో బుధవారం ఏకాదశి సందర్భంగా పలు ఆలయాలలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజీవనగర్ కోదండరామాలయంలో లక్ష్మీవేంకటేశ్వరుడికి, పద్మావ తినగర్‌లో శ్రీకృష్ణ మందిరంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. సంజీవనగర్ రామాలయంలో వేంకటేశ్వరుడు విశేష అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. సంజీవనగర్ రామాలయం, రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా తులసిమాలలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉమామహేశ్వర ఆశ్రమం, శ్రీకృష్ణమందిరంలో భక్తులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను గీతాపారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

● నంద్యాల పప్పులబట్టీ బజారులో వెలసిన రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా భావసారక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

నందికొట్కూరు: నందికొట్కూరులో తొలి ఏకాదశిని వైభవంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలో అన్ని గ్రామాల్లో దేవాలయాల్లో తొలి ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బొళ్ళవరం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో, జూపాడుబంగ్లాలోని తర్తూరు గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథస్వామి దేవస్థానంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు కాలి నడకన పల్లకీ సేవలో లక్ష్మీరంగనాథస్వామి చిత్ర పటాన్ని మోసుకుంటూ వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమం పీఠాదిపతి రామనందస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని జూటూరు గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయం నుం,ఇ జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలోని రంగనాథస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఏకాదశి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలు వేకువ జామున్నే వైష్ణవ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా మండలంలోని బూజనూరు గ్రామ సమీపంలో వెలసిన బాలాజీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి అష్టోత్తర శతనామవళి, విష్ణుసహస్ర నామ పారాయణాలు నిర్వహించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో గురువారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. మండలంలోని నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీచౌడేశ్వరీదేవీ ఆలయం, జంబులా పరమేశ్వరి ఆలయం, సాయిబాబా ఆలయం, శివాలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయం, ఏకలవ్యానగర్‌లోని రామాలయం, మార్కండేయ స్వామి ఆలయం తదితర ఆలయాలకు భక్తులు తరలివెళ్లారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉత్తరాయనం నుంచి దక్షిణాయనం మార్పును పురస్కరించుకుని అయా ఆలయాల్లో దేవతామూర్తులకు విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉపవాసాలు, వ్రతాలు, విష్ణుఆరాధనలు చేయడంతో పాటు పారాయణాలు, భావకథలు పఠించారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం, బాపనంతాపురం గ్రామాల్లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి.ఆయా ఆలయాల్లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని వేంకటనాథుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో తొలి ఏకాదశి వేడుకలను బుధవారం పట్టణంతో పాటు, పలు గ్రామాలలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వెలుగోడులోని లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకల్లో భాగంగా ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తాదులకు అల్పాహార వితరణ చేపట్టారు.





నంద్యాలలోని రామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు, పాండురంగస్వామి ఆలయంలో కల్యాణం

వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీ

● ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు భరోసా
● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీతో పాటు భూదందాలు జరిగాయని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ హయంలో దాదాపు 1.75లక్షల ఎకరాల భూఆక్రమణలు జరిగాయని, వాటి విలువ రూ.35,576 కోట్లకుపైనే ఉందని అన్నారు. అలాగే ఇళ్లపట్టాల పేరుతో 10వేల ఎకరాల పేదల భూములను కాజేయడంతో పాటు ఇసుక దందాలో రూ.9750 కోట్లను దండుకున్నారని మండిపడ్డారు. కొండలను, గుట్టలను వదలకుండా కొల్లకొట్టారని చెప్పారు. రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూదోపిడీకి పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రజలకు భరోసానిచ్చినట్లు గుర్తుచేశారు. విచ్చలవిడిగా ప్రభుత్వ భూములను కావాల్సిన వారికి కట్టబెట్టారని ధ్వజమెత్తారు. ఇందులో ఏకంగా 13,800 ఎకరాల భూములను వైసీపీ నేతలకే ధారాదత్తం చేశారని తెలిపారు. భూహక్కు పత్రం పేరుతో ప్రచారానికే రూ.13కోట్ల ఖర్చు చేశారని వివరించారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను నామమాత్రపు రుసుముతో లీసుకు తీసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారని అన్నారు. గృహనిర్మాణ శాఖ పేరుతో 98లక్షల టన్నుల ఇసుకను మింగేశారని, జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన రూ.800కోట్లను మినహాయింపు ఇచ్చారని వెల్లడించారు. ఈ అక్రమాలన్ని ఆధారాలతో సహా ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నట్లు తెలిపారు.

21న భ్రామరి ఉత్సవం

శ్రీశైలం, జూలై 17: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 21న అషాడ పౌర్ణమిని పురస్కరించుకొని భ్రమరాంబాదేవి అమ్మవారికి శాకంబరి ఉత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. ఉత్సవంలో భాగంగా భ్రమరాంబాదేవి అమ్మవారికి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో, పలు రకాల ఫలాలతో విశేషంగా అలంకరించనున్నారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి గ్రామదేవత అంకాళమ్మకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక శాకాలంకరణ చేయనున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగనాన్ని వివిధ రకాల శాకాలతో అలంకరిస్తారు.

వ్యక్తిపై వైసీపీ నాయకుల దాడి

నందికొట్కూరు, జూలై 17: మొహర్రం పండుగ సందర్భంగా క్రాకర్స్ ఓట్స్‌ను తన్నాడంటూ ఓ సామాన్యుడిని వైసీపీ నాయకులు ఇంట్లోకి తీసుకొని వెళ్లి మరీ దాడి చేసిన ఘటన మిడ్తూరు మండలం సుంకేసుల గ్రామంలో చోటు చేసుంకుంది. గ్రామంలో మొహర్రం సందర్భంగా స్వామివారు బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఊరేగింపు జరుగుతుండగా.. దేవరాజు అనే వ్యక్తి పేలుతున్న క్రాకర్స్ డబ్బాను కాలుతో తన్నాడు. దీంతో వైసీపీకి చెందిన భరత్‌కుమార్, కౌశిక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రనాగుల ఎంగన్నలు దేవరాజును భరత్‌కుమార్ ఇంట్లోకి తీసుకెళ్లి చితకబాదారు. ఘటనపై దేవరాజు మిడ్తూరు పోలీస్ స్టేషన్‌లో భరత్‌కుమార్, కౌశిక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రనాగుల ఎంగన్నపై ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

'నిందితులను శిక్షించాలి'

నందికొట్కూరు, జూలై 17: ముచ్చుమర్రి మజారా గ్రామమైన వాసంతి ఆత్మకు శాంతి కలగాలలని, నిందితులను కఠినంగా శిక్షించాలని నందికొట్కూరు పట్టణంలో కొవ్వొత్తులతో మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి నాయకులు, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నాయకుడు గౌరీశ్వర్ నాయుడు మాట్లాడుతూ బాలికలు, మహిళలు స్వేచ్ఛగా సమాజంలో తిరగలేక అవమానాలు, హత్యాచారాలు, చివరకు హత్యకు గురవుతున్నారన్నారు. మన దేశంలో గల్ఫ్ దేశాల్లో ఉన్నటువంటి కఠిన చట్టాలు అమలు చేస్తే మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. ప్రస్తుతం నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. లాయర్ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు సేవలు భేష్: ఎస్పీ

నంద్యాల క్రైం, జూలై 17: పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పని చేసిన హోం గార్డు రమేష్‌బాబు సేవలు భేష్ అని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా కొనియాడారు. నంద్యాల యూనిట్‌కు చెందిన ఎస్.రమేష్‌బాబు (హోంగార్డు -290) బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో రమేష్‌బాబు దంపతులను ఎస్పీ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఇతర పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. రమేష్‌బాబుకు చెక్కులు, పోలీస్ శాఖ తరఫున బహుమతులను అందజేశారు. అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, హోం గార్డు ఇన్‌చార్జి బద్దు, సిబ్బంది గోపి, నరసింహులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలపై స్పెషల్ డ్రైవ్

నంద్యాల (నూనెపల్లె), జూలై 17: జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఆకస్మిక తనిఖీలలో 17 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు డీటీవో శివారెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు కాంట్రాక్ట్ క్యారేజి బస్సులు, పరిమితికి మించి అదిక బరువుతో వెళుతున్న 11 గూడ్స్ వామనాలు, 1 మ్యాక్సీ క్యాబ్, 3 ఇతర వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 17 వాహనాలపై రూ 4.23 లక్షల అపరాద రుసుము విధించడం జరిగిందన్నారు. తనిఖీలలో నంద్యాల డోన్ ఆత్మకూరు సంబంధించిన ఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పత్తి దిగుబడి తగ్గకుండా చర్యలు తీసుకోవాలి'

నంద్యాల టౌన్, జూలై 17: ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు భూ స్వభావాన్ని బట్టి తేలిక, మధ్యస్థ భూముల్లో దగ్గర అచ్చు వేసుకొని మొక్కల సంఖ్యను పెంచుకునే విధంగా పత్తిగింజలను విత్తుకుంటే పత్తి దిగుబడి తగ్గకుండా ఉంటుందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పత్తిశాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. బుధవారం పలు ప్రాంతాల్లో పత్తి సాగు చేసిన భూములను ఆయన పరిశీలించారు. రైతులకు వివిధ సలహాలు, సూచనలు ఇచ్చారు. పత్తి విత్తిన 10 రోజుల్లో మొలకరాని చోట పత్తిగింజ విత్తుకోవాలని, రెండు మొలకలు ఉన్న చోట ఒకటి పీకి వేయాలని, కుదురుకు ఒక్క మొక్క మాత్రమే ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలకు అనుగుణంగా ఎరువుల వాడకం, క్రిమి సంహారక మందులను వాడకాన్ని చేపట్టి పత్తి దిగుబడి తగ్గకుండా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని శివ రామకృష్ణ సూచించారు.

ముగిసిన మొహర్రం



నంద్యాలలో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



మహానంది: గాజులపల్లిలో..



ఆత్మకూరు రూరల్: వడ్లరామాపురంలో..

నంద్యాల (కల్చరల్) జూలై 17: నంద్యాల పట్టణంలో మొహర్రం సందర్భంగా బుధవారం పీర్ల చావిడివద్ద భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి నీలివీధిలోని బిఫాతీమా, బైరమల్ వీదిలోని ఆలీ ఆక్బర్, పెద్దబండ దగ్గరలోని బుడ్డాబుడ్డి, నడిగడ్డలోని హస్సేన్ హుస్సేన్, తెలుగుపేట ఇమాం ఖాసీం పీర్లకు ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. అలనాటి అమర వీరులను తలచుకుంటూ, నామస్మరణ చేస్తూ పీర్ల చావిడి నిర్వహకులు పీర్లను సామూహికంగా కుందూనది ఒడ్డుకు తీసుకువెళ్లారు. నైవేద్యాలు సమర్పించి పీర్లను భాదా తప్త హృదయాలతో కుందూనదిలో నిమజ్జనం చేశారు.

గోస్పాడు: గోస్పాడు మండలంలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒంటివెలగల గ్రామంలో అంగరంగ వైభవంగా మొహరం పండుగ వేడుకలు నిర్వహించారు. పూర్వం నుంచి మొహరం వేడుకలను గ్రామస్థులందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవడం అనవాయితీ అని టీడీపీ నాయకుడు శీలం భాస్కర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో శీలం వీరారెడ్డి, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలంలో బుధవారం ఘనంగా మెహరం వేడుకలను ముస్లీములు నిర్వహించారు. గాజులపల్లి, గోపవరం, బుక్కాపురం తమ్మడపల్లి, తిమ్మాపురం, యి.బొల్లవరం, బసాపురం, నందిపల్లి, మసీదుపురం, సీతారామపురం గ్రామాల్లో పీర్లను చావిడి వద్ద ఉంచి ప్రత్యేక పూజలతో పాటు చక్కెరను చదివింపులుగా సమర్పించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో పీర్లను మేళతాళాలతో యువత రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం పీర్లను సమీపంలోని ఏటిలో నిమజ్జనం చేసారు.

బండిఆత్మకూరు: మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళ, బుధవారాల్లో సరిగెత్తులు నిర్వహించి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం పీర్లకు గ్రామోత్సవాల నిర్వహించి, సమీపంలోని బావుల్లో, కాలువల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

పాణ్యం: మొహర్రం వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మూడురోజుల సరిగెత్తు వేడుకల అనంతరం బుధవారం మధ్యాహ్నం నుంచే గ్రామ చావిడిల నుంచి పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో పీర్లపై గంధం చల్లుతూ మతాలకతీతంగా గ్రామాల ప్రజలు ఉత్సవంలో పాల్గొన్నారు. నిమజ్జనం అనంతరం పీర్లను చావిడిలకు తరలించారు. గోరుకల్లులోని లాల్‌స్వామి, డాల్ స్వామి దర్గాల నుంచి బయలు దేరిన పీర్ల గ్రామోత్సవం అనంతరం నిమజ్జనానికి తరలించారు. పాణ్యంలోని అలీఅక్బర్ దర్గా వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహరం వేడుకలు బుధవారం సాయంత్రం వైభవంగా ముగిశాయి. ముఖ్యంగా మండలంలోని ముసలిమడుగు, గుమ్మడాపురం, దుద్యాల, కొత్తపల్లి, ఎర్రమఠం, గ్రామాల్లో వారం రోజుల పాటు జరిగిన మొహరం వేడుకల్లో గ్రామస్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకున్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున పీర్ల సవారితో గ్రామ వీధుల్లోకి రాగా ప్రజలు కులమతాలకు అతీతంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం పీర్లను అయా గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లకు పూలు, దట్టిలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని తాటిపాడు గ్రామంలో పెద్దఉసేనాలం, చిన్నఉసేనాలం, మౌలాలి, అలెగ్బార్, తంగడంచంలో గోకారమయ్య పీర్లను భక్తులు ఎత్తుకుని ఘనంగా ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తమ కోర్కెలు తీర్చాలని కోరుకున్నారు. అనంతరం పీర్లను ఏటికి పంపించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో మొహర్రం వేడుకలు సంబరంగా జరిగాయి. ఈ నెల 12వ తేదిన పట్టణంలోని పెద్దపీర్లవీధి, పెద్దబజార్, గొల్లపేట, వడ్లరామాపురం రస్తా, నీటితొట్లువీధి, అర్బన్‌కాలనీ, కల్లావీధి తదితర కాలనీలను పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలను నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి పీర్లకు మొక్కులు తీర్చుకున్నారు. చివరిరోజైన బుధవారం రాత్రి పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ పీర్లను ఊగించి వేడుకలకు ముగింపు పలికారు. ఈ వేడుకను పురస్కరించుకుని పీర్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. పీర్ల ఊరేగింపు వేడుకలను డ్రమ్స్‌వాయిద్యాల నడుమ యువత సంబరాలు జరిపారు. ఈవేడుకలకు విచ్చేసిన భక్తులకు పెద్దపీర్ల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆత్మకూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాలలో మొహర్రం వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కుల మతాలకు అతీతంగా హిందూ, ముస్లిం భక్తులు పీర్ల చావిడి వద్దకు తరలివచ్చి కొలువుతీరిన పీర్ల స్వాములకు పూల దత్తీలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వెలుగోడు: మొహర్రం వేడుకలను బుధవారం మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో పది రోజులు పాటు పీర్లకు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో కుల మతాలకు అతీతంగా భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు.



పాణ్యంలో..



బండిఆత్మకూరు: పెద్దదేవళాపురంలో..



గడివేముల: పెసరవాయి గ్రామంలో



గోస్పాడు: ఒంటివెలగల గ్రామంలో..



కొత్తపల్లి: ముసలిమడుగు గ్రామంలో..



జూపాడుబంగ్లా: తంగడంచ గ్రామంలో..



వెలుగోడు: గుంతకందాల గ్రామంలో..



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన పీర్లు

ఎంపీ విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలి

డోన్‌లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల ధర్నా



డోన్‌లో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

డోన్, జూలై 17: వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలపై డోన్ పట్టణంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. విజయ సాయిరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో జర్నలిస్టులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, మహా న్యూస్, టీవీ-5, ఈటీవీ యాజమాన్యాలను వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి దూషిస్తూ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, రాధాకృష్ణ, నాయకులు నాగరాజు, రఘు, జనసేన నాయకులు బ్రహ్మం, ఏఐటీయూసీ నాయకులు చిన్న రెహిమాన్, ఎస్ఎస్‌యుఐ నాయకులు విజయకుమార్, జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు ఆచారి, నాగరాజు, రాజా, సుధాకర్ యాదవ్, శేఖర్, సూర్య వెంకటేశ్, ఖాదర్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: మీడియా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బనగానపల్లె పట్టణంలో జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం సీఐ గంటా సుబ్బారావుకు వినతి ప్రతం సమర్పించారు. మీడియా గొంతు నొక్కి తాము ఇంకా జగన్ పాలనలోనే ఉన్నామని విజయసాయిరెడ్డి మతిభ్రమించి మాట్లాడడం దారుణమన్నారు.

నేడు నిత్యావసర వస్తువుల కౌంటర్ ప్రారంభం

బనగానపల్లె, జూలై 17: ప్రభుత్వం తరపున నిత్యావసర వస్తువులను చౌక ధరలకే అందించడానికి గ్రంథాలయం పక్కన ఉన్న రూమ్ నంబరు 1 కౌంటర్‌ను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం ఉదయం ప్రారంభిం చను న్నట్లు బనగానపల్లె తహసీల్దారు రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. నియో జకవర్గానికి సంబంధించి బనగానపల్లె పట్టణంలోని గ్రంథాలయం పక్కనే ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించిన రూమ్ నం బరు 1లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులు బియ్యం, కందిబేడలు తక్కువ ధరలకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తూ హోల్‌సేల్ వ్యాపా రులు, రైస్ మిల్లుల యజమానుల సాయంతో ఈకౌంటర్‌ను ఏర్పాటు చేస్తు నట్లు తెలిపారు.

'చంద్రన్న పాలనలో పేదలకు భరోసా'

చాగలమర్రి, జూలై 17: సీఎం చంద్రబాబు పాలనలో పేదలకు ఆర్థిక భరోసా వచ్చిందని మండల దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం చాగలమర్రిలోని ప్రధాన పీరు లాల్‌స్వామికి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో దూదేకుల సంక్షేమం విస్మరించిందని అన్నారు. సీఎం చంద్రబాబు దూదేకుల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. 50 సంవత్సరాలకే పింఛన్ హామీని అమలు చేయడం హర్షణీయమన్నారు. ప్రజలకు ఉచిత ఇసుకను అందించేలా సీఎం నూతన పాలసీని అమలు చేశారన్నారు. దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్రి బీసీ చొరవతో కాలేజీకి బోరు ఏర్పాటు

కొలిమిగుండ్ల, జూలై 17: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరారెడ్డి చొరవతో కొలిమిగుండ్ల జూనియర్ కళాశాలకు తాగునీటి సమస్య తీరింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు తాగునీటి సమస్యను మంత్రి బీసీ, పక్కీరారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే గురువారం తెల్లవారుజామునే బోరు తవ్వించినట్లు కొలిమిగుండ్ల టీడీపీ నాయకులు ఉలువల నరసింహుడు, బీవీ నాయుడు తెలిపారు.

ఆలయ భూముల కౌలు వేలం పాటలు

నంద్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని అమృత లింగేశ్వరస్వామికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం పాటలను నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి బుధవారం చెప్పారు. దేవాలయానికి 20.59 ఎకరాల భూమి ఉందని, ఈ భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకునే రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేలం పాటలను ఈనెల 22వ తేదిన దేవాలయంలో కమిటీ సమక్షంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొను వారు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించాలని, దేవాలయానికి అప్పు ఉన్నవారు, దేవాలయంపై కోర్టులో దావా వేసిన వారు వేలం పాటకు అనర్హులని అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి చెప్పారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం

ఉయ్యాలవాడ, జూలై 17: మండలంలోని హరివరం గ్రామంలో నిర్వహించిన ఆలయ భూముల కౌలు వేలంలో రూ.3.80 లక్షలు ఆదాయం పెరిగిందని దేవదాయశాఖ ఈవో చంద్రుడు తెలిపారు. బుధవారం శివాల యం వద్ద కౌలు వేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనార్దన, వినాయక, రామలింగేశ్వరస్వాములకు చెందిన 90.80 ఎకరాల భూమిని ఏడాది పాటు కౌలు వేలం నిర్వహించామని చెప్పారు. ఈ భూములకు గతే డాది రూ. 13.50 లక్షలు కౌలు రాగా ఈ ఏడాది రూ. 16.80 లక్షలు వచ్చిందని తెలిపారు. గ్రామ పెద్దలు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

చాగలమర్రి, జూలై 17: జీపీఎస్ గెజిట్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా కోరారు. బుధవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీన జీవో 117ను రద్దు చేయాలని కోరారు. పాఠశాలల విలీనం పట్ల విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు జీతాలు చెల్లించడం పట్ల హర్షం ప్రకటించారు. అలాగే పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు నారాయణరెడ్డి, సుబ్బారావు, సురేషప్ప, శేషాద్రి, మాబుహుసేన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

డోన్(రూరల్), జూలై 17: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఘనం గా నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మేడసారి గోపాల్, ఏపీ గిరిజన సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోట రాముడు, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు చోట రామయ్య, సాలన్న, ప్రతాప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో బుధవారం ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనో హరమ్మ, డాక్టర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంలో 108 వైద్యసేవలు

బనగానపల్లె, జూలై 17: రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మొహర్రం సందర్భంగా గాయపడ్డ వారికి 108 వాహనం ద్వారా వైద్య చికిత్సలు అందించినట్లు పట్టణ మాజీ సర్పంచ్ బీసీరాజారెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని దొరకోట నుంచి జుర్రేరు వాగు వరకు మొహర్రం సందర్భంగా షియా మతస్థులు కత్తులు, బ్లేడ్లుతో ఛాతీ, వీపు వెనుక భాగంలో కొట్టుకుంటూ మాతం నిర్వహించారు. ఇందులో గాయపడినవారికి కుట్లు వేయించి, వైద్యం చేయించినట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు.

ముగిసిన మొహర్రం

డోన్(రూరల్), జూలై 17: డోన్ పట్టణంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. పట్టణంలోని కొండపేట, పాతపేట, తారక రామనగర్, కంబలపాడు సర్కిల్, తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లను ఏటికి తరలించారు. పట్టణంలోని పాతపేట మెయిన్‌బజారు మీదుగా దస్తగిరి స్వామి పీర్లను మేళతాళాల మధ్య ఘనంగా కదిలించి ఏటికి తరలి వెళ్లాయి.

డోన్: మండలంలోని వలసల గ్రామంలో బుధవారం సాయంత్రం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ వేడుకల్లో పాల్గొని పీర్లకు పూజలు నిర్వహించారు. గ్రామ వీధుల్లో పీర్లను మేళ తాళాల మధ్య ఏటికి తరలించారు.

అవుకు: మండలంలో వారం రోజులపాటు జరిగిన మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. అవుకు పట్టణంలోని చావిళ్లలో వెలసిన ఖాజబందేనవాజ్. మౌలాలి, కప్పలగుంతల పీర్లతోపాటు మరో ఎనిమిది చావిళ్లలో పీర్లను నిలబెట్టారు. చావిళ్ల వద్దకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం చావిళ్లలోని పీర్లను ఊరేగింపుగా ఏటికి తరలించారు.

ప్యాపిలి: మండలంలో తొమ్మిది రోజులపాటు జరిగిన మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. ప్యాపిలి పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లో పీర్ల సవారీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బనగానపల్లె: మండలంలోని యాగంటిపల్లె, పసుపుల, చిన్నరాజుపాలెం, పెద్దరాజుపాలెం, ఇల్లూరు కొత్తపేట, యర్రగుడి, పలుకూరు, నందవరం, రామకృష్ణాపురం, కైప, అప్పలాపురం, టంగుటూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. సాయంత్రం పీర్లను తప్పెట్లు, మేళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ప్రజలు పీర్లపై గట్టాలు చల్లారు. అనంతరం పీర్లను ఆయా గ్రామాల సమీపంలోని వాగులకు విషాద గీతాలు ఆలపిస్తూ తీసుకువెళ్లారు. వాగుల్లో పీర్లను శుద్ధి చేసి యథావిధిగా చావిళ్లకు చేర్చారు.

కోవెలకుంట్ల: మండలంలోని వివిధ గ్రామాలతోపాటు కోవెలకుంట్ల పట్టణంలో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. సాయంత్రం పీర్లను కోవెలకుంట్ల పట్టణంలోని మెయిన్ బజార్‌లో వీధుల గుండా ఊరేగించారు ఈ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని పీర్లకు గట్టాలు చల్లారు. పీర్లను ఆయా గ్రామాల్లో ఏటి వద్దకు తీసుకువెళ్లి శుద్ధి చేసి తిరిగి యథావిధిగా చావిళ్లకు చేర్చారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో ప్రజలు బుధవారం మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొ న్నారు. నాలుగు రోజుల క్రితం పీర్ల చావిడ్లలో ప్రతిష్ఠించిన పీర్లను సమీపంలోని కాలువల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ సీఐ రమేష్ బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం పండుగను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. చాగలమర్రిలో కొలువుదీరిన ప్రధాన పీరు లాల్‌స్వామిని భారీ జనసం దోహం మధ్య ఊరేగించారు. ఆయా ప్రదేశాల్లో కొలువుదీరిన హసన్, హుసేన్, అలీఅక్బర్, హుర్‌సయ్యద్ పీర్ల వద్దకు లాల్‌స్వామిని తీసుకెళ్లి ఫాతెహాలు చేశారు. గంధం చల్లుకుంటూ లాల్‌స్వామిని ఊరేగించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ పర్యవేక్షణ లో ఎస్ఐలు రమణయ్య, రామాంజనేయరెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పీర్లను నిమజ్జనం కోసం ఊరేగింపుగా తీసుకెళ్లారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం పీర్లలను ఏటికి తరలించారు. మీర్జాపురం గ్రామ వీధుల గుండా పీర్లను ఊరేగింపు చేస్తూ ఊరి చివర బావి వద్దకు తరలించి నిమజ్జనం చేశారు. అనంతరం పీర్లను శుద్ధి చేసి, అలాపన ప్రార్థనలు చేసుకుంటూ చావిడికి చేర్చారు.

సంజామల: మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. బుధవారం షహదత్ వేడుకలను నిర్వహించారు. సంజామలలో కొలువుదీరిన ఇమామ్ ఖాసీం, హసన్ హుసేన్, హజరత్ అబ్బాస్ పీర్లకు మేళతాలాలతో ఊరేగింపుగా ఏటికి తీసుకెళ్లి శుద్ధి చేశారు.

బేతంచెర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. పీర్లను అశేష జనవాహిని మధ్య ఏటికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శివశంకర్ నాయక్ సమక్షంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడ, మాయలూరు, రూపనగుడి, అల్లూరు, హరివరం, బోడెమ్మనూరు, ఇంజేడు, కాకరవాడ, ఆర్.పాంపల్లె, పడిగెపాడు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఉయ్యాలవాడలో గ్రామస్థులు వివిధ రకాల వేషధారణలతో సందడి చేశారు. పీర్లను స్థానిక కుందూనదిలో నిమజ్జనం చేశారు.

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె, బెల్లగలపల్లె, రుద్రవరం, తువ్వపల్లె ఇంకా పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. పీర్లను ఏటికి సాగనంపారు. ఆయా గ్రామాల్లో వసంతాలు చల్లుకున్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిష్టిపాడు, కొండాపురం, గుండుపాపల గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. అలాగే క్రిష్టిపాడు గ్రామంలో పీర్లకు మేళతా ళాల మధ్య గంధం చల్లుకుంటూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం కుందూ నదిలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, వనికెందిన్నె తదితర అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పీర్ల చావిడిల వద్ద కొలువుదీరిన పీర్లను తప్పెట్లు, వాయిద్యాలతో ఏటికి సాగనంపారు.



ఉయ్యాలవాడలో ఏటికి తరలివెళ్తున్న పీర్లు



సంజామలలో..



డోన్‌లో..



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో..



అవుకులో..



శిరివెళ్ల మండలం వనికెందిన్నెలో..



చాగలమర్రిలో లాల్‌స్వామి ఊరేగింపు



కొలిమిగుండ్ల మండలం మీర్జాపురంలో ఏటికి తరలుతున్న పీర్లు



కోవెలకుంట్లలో..



రుద్రవరం మండలం కొండమాయపల్లెలో..



బేతంచెర్లలో..



ప్యాపిలిలో..

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

చాగలమర్రి, జూలై 17: మండలంలోని ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశి పండుగను హిందూవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పండుగను చేశారు. శ్రీకృష్ణుడికి భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. కోదండరామ, పట్టాభిరామ, పాత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో పాత శివాలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవుకు: తొలి ఏకాదశి వేడుకలను మండలంలోని ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. అవుకు పట్టణంలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వాముల వారిని అర్చకులు పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని గ్రామాల్లో ప్రజలు తొలి ఏకాదశి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోవెల కుంట్లలోని పాండురంగస్వామి ఆలయంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ఉపవాసం ఉండి భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పేల పిండి వంటలు ప్రసాదంగా ఆలయాల్లో పంపిణీ చేశారు. మండలంలోని పలుకూరు గ్రామంలోని రామేశ్వరాలయంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పూజలు చేశారు.

కొలిమిగుండ్ల: తొలి ఏకాదశి వేడుకలు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొలిమిగుండ్ల చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు మండలం లోని కల్వటాల, బెలుం, బెలుం శింగవరం, కోటపాడు, కనకాద్రిపల్లె, తిమ్మనాయినిపేట, నాగిశెట్టిపల్లె, లక్ష్మంపల్లె, అంకిరెడ్డిపల్లె, పేట్నికోట, గొర్విమానుపల్లె తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో బుధవారం భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. వాసాపురం మానసలింగేశ్వరస్వామికి రుద్రవరంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొర్నిపాడులోని మాధవస్వామి, ఎరుకలిస్వామి ఆలయం, శివాలయం తదితర ఆలయాల్లో భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి పండుగ కావడంతో మహిళలు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లి కాయకర్పూరం సమర్పించారు. అర్చకులు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

శిరివెళ్ల: మండలంలోని ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. యర్రగుంట్లలోని సద్గురు రామకృష్ణానంద గీతాశ్రమంలో శ్రీకృష్ణ భగవానుడికి విశేష పూజలు నిర్వహించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం చేశారు.



చాగలమర్రిలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



పలుకూరులో పూజలు చేస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



రుద్రవరంలో మానస లింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

శిల్పా వెంచర్ అక్రమాలపై అసెంబ్లీలో చర్చిస్తా: ఎమ్మెల్యే

నంద్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శిల్పా వెంచర్‌లో ఎన్నో అక్రమాలు ఉన్నాయని, వాటిపై అసెంబ్లీలో చర్చిస్తానని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శిల్పా వెంచర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పడకండ్ల, పాలసాగరం గ్రామాలల్లోని కేసీ కాలువ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించే కాలువను వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమ స్వార్థం కోసం కాలువను పూడ్చేసి, పక్కన నిర్మించడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు నీరందటం లేదని ఆరోపించారు. ఈ ఏడాది వర్షాలు కురుస్తుండటంతో పంట కాలువలకు నీరు పారే కేసీ కాలువను దౌర్జన్యంగా శిల్పా వెంచర్ వేసి వైసీప నాయకులు కాలువను పూడ్చేశారని, సమస్యను పరిష్కరించాలని రైతులు తన దృష్టికి తీసుక వచ్చారని చెప్పారు. శిల్పా వెంచర్ వెలవడానికి సహకరించిన వ్యక్తుల్నిగాని, అధికారులను వదలబోమని అన్నారు. శిల్పా వెంచర్‌ల ద్వారా ఆళ్లగడ్డలోనే కాకుండా వివిధ ప్రాంతాలలో ప్రజలను మోసం చేశారని, దీనిపై ఆందోళనలు కూడా చేశారని ఆమె గుర్తు చేశారు. సుప్రీం కోర్టు నిబంధనలను శిల్పా వెంచర్ నిర్వాహకులు లెక్క చేయడం లేదన్నారు. శిల్పా వెంచర్ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరతానన్నారు. తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీకి 10 శాతం భూమిని కేటాయించాలని, దీని ప్రకారం 6 ఎకరాలు కేటాయించారని, అది కూడా ప్రభుత్వ భూమేనని అన్నారు. చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించే కాలువను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అఖిలప్రియ అధికారులను ఆదేశించారు. శిల్పా వెంచర్‌లో జరిగిన అక్రమాలను వారం రోజుల్లో నిగ్గు తేల్చుతానన్నారు.



అక్రమంగా నిర్మించిన కేసీ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

'అడవి సంరక్షణలో నిర్లక్ష్యం తగదు'

రుద్రవరం, జూలై 17: అడవి సంరక్షణలో నిర్లక్ష్యం తగదని ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్, బీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా అన్నారు. రుద్రవరం రేంజిలో పర్యటించారు. మంగళవారం రాత్రి వరకు పర్యటన కొనసాగిందని బుధవారం తెలిపారు. బోరింగ్ బేస్ క్యాంపు, నూతల బేస్ క్యాంపు, ఎగువ అహోబిలం, బార్గవనరసింహస్వామి దేవాలయాల ప్రాంతాలను సందర్శించారు. నల్లమల్లలోని నవనరసింహుల క్షేత్రాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. రేంజర్ శ్రీపతి నాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి ఆలమూరు సెక్షన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

21న గురు పౌర్ణమి వేడుకలు

కొలిమిగుండ్ల, జూలై 17: గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 21న కొలిమిగుండ్లలోని సాయిబాబా మందిరంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు షిరిడీ సాయిబాబా ట్రస్ట్ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భుగర్భశాఖ మాజీ డైరెక్టర్ రాజగోపాల్ బుధవారం వెల్లడించారు. 21న ఉదయం 10గంటలకు హైదరాబాదుకు చెందిన ప్రముఖ గాయకులు డాక్టర్ రవీంద్రబాబు అరవ, శ్రీనోరి రఘురామమూర్తి దంపతుల బృందంచే భక్తి గీతాంజలి పాటల కచేరి ఉంటుందని ఆయన తెలిపారు.

'చేతి పంపుల నీరు తాగొద్దు'

రుద్రవరం, జూలై 17: మండలంలోని ముత్తలూరు, నరసాపురం గ్రామాల్లో చేతి పంపుల నీరు తాగడం నిషేధించడమైనదని, ఎవరూ తాగొద్దని ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌శర్మ తెలిపారు. చేతి పంపుల నీరు ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయించామన్నారు. ఆ చేతి పంపుల నీరు కలుషితమైందని తెలిపారు. ముత్తలూరు గ్రామంలో ఆంజినేయస్వామి, అనాథ ఆశ్రమం వద్ద ఉన్న చేతి పంపులు నరసాపురంలో పాఠశాల వద్ద ఉన్న చేతి పంపుల నీరు కలుషితైమందని చెప్పారు. వర్షాలు కురియడంతో చేతిపంపుల నీరు కలుషితమైనట్లు తెలిపారు.

వెలగటూరులో తాగునీటి ఇక్కట్లు

చేనేత కాలనీకి చిలుము, పురుగుల నీరే గతి





కాలనీకి తాగునీరు సరఫరా చేసే మోటారు, మరమ్మతులు చేయించిన బోరు

కోవెలకుంట్ల, జూలై 17: గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు ఇక్కట్లు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రత్యేకంగా లక్షలాది రూపాయలు వెచ్చించి సమస్యలు లేకుండా చేస్తున్నామని అధికారులు గొప్పలు చెబుతున్నప్పటికీ కింది స్థాయిలో అది అమలు కావడంలేదు. అందుకు ఉదాహరణగా వెలగటూరు గ్రామంలోని చేనేత కాలనీ అని చెప్పవచ్చు. కోవెల కుంట్ల పరిధిలోని వెలగటూరు గ్రామానికి సమీపంలోనే చేనేత కాలనీ ఉంది. ఈ కాలనీలో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీ ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు బోరు వేసి మోటరు, పైపులైను అమర్చి ఇంటిం టికీ తాగునీరు సరఫరా చేస్తున్నారు. రెండు వారాల క్రితం నీటిని సరఫరా చేసే మోటరు చెడి పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేద న వ్యక్తం చేశారు. కాలనీ సమీపంలో వెలగటూరుకు వెళ్లి నీరు తెచ్చుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయం అధికారులకు, సర్పంచ్‌కు తెలిపినా పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ఒక్కొక్కరు వంద రూపాయలు చందా లు వేసుకుని కాలనీలో చాలా కాలంగా చెడిపోయి శిథిలా వస్థలో ఉన్న బోరు రిపేరు చేయించుకున్నారు. అయితే ఈ బోరు నుంచి చిలుము పట్టిన పురుగులు ఉన్న నీరు వస్తోంది. విధిలేక ఈ నీరే వాడుకుంటున్నామని కాలనీవాసులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెడిపోయిన మోటరు రిపేరు చేయించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.